# పీటముడి



పొద్దుతిరుగుడుపువ్వు మధ్యలో ఉండే గింజల్లా మిల్లీ మీటరు ఖాళీ లేకుండా తరగతి గది కిటకిటలాడిపోతూంది. చెదిరిన జుంటి తేనీగల్లా ఒకటే గోల. పాఠం చెప్పడం నాకెప్పుడూ ప్రియమైన వ్యాపకమే కాని, అంబలి తాగేవాడి పాలిట మీసాల్లా ... ఆ ఆనందానికి ఇలాంటి ప్రతిబంధకాలు తప్పడం లేదు. అయినా నేను గొంతు విప్పితే ఆ గోల సద్దుమణగి పోతుంది కదా !

అలవాటైన పద్ధతిలో బెత్తాన్ని టేబుల్‌మీద రెండుసార్లు తాటించి, జడ్జి ఆర్టర్ ... ఆర్డర్ ... అన్న చందాన 'సైలెన్స్' అంటూ అరిచాను. వాతావరణం ఒకింత అదుపులోకొచ్చింది. అయినా అది సరిపోదు.

"ఒరేయ్ ! మీ అరవడం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పండి. అప్పుడే నేను మొదలెడతా చెప్పడం" బ్రహ్మాస్త్రం వదిలాను.

క్షణాల్లో నిశ్శబ్దం పరచుకుంది. నేను యధాలాపంగా అప్పుడు చెప్పబోయే లెక్కకు మూల సూత్రమైన "$(a + b)^2 = a^2 + 2ab + \ldots$" అంటూ ఓ విద్యార్థి కోసం వెతికాను కళ్ళతోనే. వాడు కనిపించలేదు.

"ఏంటీ, రమ్య ఈ రోజు కూడా రాలేదా ?"ఆశ్చర్యం, విసుగూ నా గొంతులో.

"రాలేదు సార్ !" పిల్లలంతా కోరస్‌గా అరిచారు.

"వాడెప్పుడూ లేటేసార్ ..."

"వారంలో రెండ్రోజులు డుమ్మా కొడ్తాడు సార్ ..."

"ఆరో తరగతిలో పేరు తీసేసినారు సార్ - ఇట్లేజేస్తే" ... పితూరీల వర్షం కురిసింది పిల్ల మేఘాలనుండి. 'ఏడో తరగతికొచ్చినా, ఎల్‌కేజీ లక్షణాలు పోలేదీ వెధవలకి...' అనుకుంటూ గుమ్మంవైపు చూశాను.

కొంచెం వగరుస్తూ రమ్య !

'రమ్య' ఏంటీ ఆడపిల్లల పేరులా ?' అనుకున్నాను నేను కూడా మొదట.

తర్వాత ఆలోచించి చూస్తే అర్థమయ్యింది. భీమ్యానాయక్, గోప్యానాయక్ లాగే లాగే వీనిపేరు రామ్యానాయక్ అయి ఉంటుంది. ఇంగ్లీషు భాషా ప్రభావంతో రామ్యా - రమ్యాగా మారిపోయిందన్నమాట. పాపం ! ఈ పాపానికొడిగట్టిన ఇంగ్లీషుకి మాత్రం ఆ తారతమ్యం లేదు. ఎటొచ్చి తెలుగు వాళ్ళే తప్పులో కాలేశారు. అదీ మన భాషా స్థితి.

"ఒరేయ్ ! నీకు బుద్ధుందా ? అరగంట లేటు ...." బెత్తం పైకెత్తాను.

వాడు బిత్తరపోలేదు. ఏమాత్రం జంకూ-కొంకూ లేకుండా చేయిసాచాడు. 'తప్పుచేశాను. శిక్షించండి !' అన్నట్లు.

వాడ్ని తరచూ అలా దండించడం నాకే నచ్చడం లేదు. అలాగని కొట్టకుండా వదిలేస్తే మిగతా పిల్లలకు అలుసైపోతుంది. అందుకే వేసీ వేయనట్టు ఓ దెబ్బ.

సానుభూతిగా చూశాను.

"నాయనున్నడు. ముందు అతనే ఈ పనిజేసేవోడు. పగలు కూడా తాగి కొట్లాటలు

పెట్టుకుంటున్నాడంటాని పని మాన్పించేసినాడు సేటు. అప్పటినుంచీ నేను జేస్తున్నా. అన్నలు లేరు. ఇద్దరు తమ్ములు, ఒక చెల్లి ఉంది" క్లుప్తంగా చెప్పాడు.

నాకేమీ పాలు పోకుండా వుంది. కొద్దిసేపు ఆలోచించి ఓ నిట్టూర్పు విడిచాను. "రమ్యా ! నువ్వు బాగా చదువుతావు. బడి మానేయకు. ఆలస్యంగారాకు. బాగా చదువు కోవాలి".

వాడి మనసులోని ఆనందం కళ్ళలో ప్రతిఫలించింది.

రమ్య వెళ్ళాక నా మనసు సమస్య పరిష్కారంకోసం తీవ్రంగా ఆలోచించింది. వాడున్న పరిస్థితుల్లో ఏ నిర్ణయం వానికి న్యాయం చేస్తుందో తేల్చుకోలేక పోయాను. ఓసారి ఆ కుటుంబ పరిస్థితి ప్రత్యక్షంగా చూసి, రమ్య తల్లిదండ్రులతో మాట్లాడితేగాని ఓ నిర్ణయానికి రావడం కష్టం. ఆ పనిచేయాలి.

హైదరాబాదు (ఆదరాబదరా) వాతావరణంలో ఎవరి గొడవ వారిది. కాలచక్రంలో పోటీపడుతూ, ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా కిందా మీదా పడుతూ పరుగులు పెట్టడమే ఆధునిక నాగరిక (నగరంలోని) జీవన శైలి. చూస్తుండగానే జనవరి ... ఫిబ్రవరి దాటి పదోతరగతి పరీక్షలు, అంతలోనే మాకిష్టమైన స్పాట్ వాల్యుయేషన్ ఒకదానివెంట ఒకటి సముద్రంలోని అలల్లా తరిమికొట్టాయి. నేను చేయదలచుకున్న ఓ మంచిపని నా ప్రమేయం లేకుండానే స్వార్థం పదఘట్టనల కింద నలిగిపోయింది. మళ్ళీ బడికెళ్ళేసరికి 7వ తరగతి 'బోర్డు' పరీక్షలు మొదలయ్యాయి.

తెలుగు, హిందీ, ఇంగ్లీషు పూర్తయ్యాయి. లెక్కల పరీక్ష ఆరోజు. ప్రశ్నాపత్రం చూశాను. తేలిగ్గానే ఉంది ...'రమ్యకైతే నూటికి నూరుమార్కులు వస్తాయి' అనుకుంటూ, రోల్ నెంబర్ ననుసరించి, వాని గది వెతుకుతూ వెళ్ళాను. రమ్య కనబడలేదు.

'ఛ ! పరీక్షరోజు కూడా ఆలస్యమేనా ?' అనుకుంటూ "రమ్య ఇంకారాలేదా ?" విసుగ్గా అడిగాను.

"వాడు రావటంలేదు సార్ !" ఇద్దరు ముగ్గురు పిల్లలు ఒకేసారి చెప్పేందుకు పోటీ

కాళ్ళకింద భూమి కదిలినట్లైంది.

"మార్చి నుండి  బడి మానేశాడు సార్" ! మరో గొంతు వివరణ.

ఆరోజు అన్నం సయించలేదు. డ్యూటీ సరిగ్గా చేయలేకపోయాను. బడి వదలగానే సరాసరి రమ్య వాళ్ళ ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరాను.

స్లమ్ ఏరియా, అడుగడుగునా కుక్కలు, పందులు ...అవన్నీ తమ నేస్తాలే అనుకునే పసివాళ్ళు. చాలీ చాలని బట్టలతో పరిసరాలను మించిన మురికి ఒంటిమీద తాండవం చేస్తుంటే అదేమీ పట్టని నిష్కల్మషమైన మనసుల్తో వాళ్ళ లోకంలో వాళ్ళు. రేపటి తాపం పట్టించుకోని స్వచ్ఛమైన జీవనాన్ని చిత్రిస్తూ ...

ఓ గుడిసె ముందు సుమారు ముప్పై అయిదేళ్ళ స్త్రీ బియ్యం ఏరుతూ కనిపించింది. ఆమే రమ్య తల్లి అని చెప్పారు. గుండెలో ఏదో తెలియని భయం.

అంతకు మించి ఏదో గుబులు. అడుగుల్లో బలాన్ని ప్రోది చేసుకుంటూ అక్కడికి చేరాను. అప్పటికే నలుగురైదుగురు పిల్లలు నా చుట్టూ మూగారు. గ్రహాంతర వాసిని పరిశీలించే శాస్త్రజ్ఞుల్లా నన్ను గమనిస్తున్నారు.

"ఆc !" ముక్తసరిగా అంటూ నన్ను చూసిందామె ఎగాదిగా. 'ఎవరు నీవు ? నీకేం పని?' లాంటి సవాలక్ష ప్రశ్నలు ప్రతిఫలిస్తున్నాయామె చూపులో.

ముందు నన్ను పరిచయం చేసుకోవడం అత్యవసరమనిపించింది.

ఆ పనిచేశాను.

ఆమె ముఖానికి కొంగు అడ్డం పెట్టుకొని శోకాలు పెట్టసాగింది. నిలబడ్డ చోటే ఏడుస్తూ కూలబడిపోయిందామె. కన్నీళ్ళు చెక్కిళ్ళు దాటి నేలను తడుపుతున్నాయి. ఆమె ఎందుకలా ఏడుస్తుందో, ఎలా సముదాయించాలో తోచక తికమక పడసాగాను.

'కొంపదీసి, మా రమ్యకేమీ కాలేదు గదా !' ఆ ఆలోచన నన్నెంతో నిస్సత్తువకి గురి చేసింది. మనస్సు శంకిస్తున్న కీడు నిజం కాకూడదని, ఆమె చెప్పబోయే నిజాన్ని వినేందుకు గుండెను చిక్కబట్టుకోవడం ... కష్టమవుతోంది.

ఇంతలో పక్క గుడిసెలోనుండి ఓ పెద్దావిడ వచ్చింది అక్కడికి. రమ్య తల్లిని బెదరించింది - లంబాడీ భాషలో, నేనెవరో తెలుసుకున్న తర్వాత ఆ ముసలావిడే చెప్పసాగింది...

"ఏం జెప్పాలె బిడ్డా. దాని బతుకు కాల్లేసినట్లే అయ్యింది. సంపాదించేటోడు ఒక్కడు, తినేటోళ్ళు అయిదు మంది. ఆ దొంగ నాకొడుకు (రమ్య తండ్రి) ఏదో ఇంత ఆదెరువు అయితాడనుకుంటే, తాగి - తాగి బొందల పడ్డడు. పొయ్యేటోడు ఉత్తగ బోకుండ సవాలక్ష కష్టాలు నెత్తికెత్తి పొయ్యిండు ..." అంటూ జరిగిన విషయమంతా చెప్పిందామె. ఆ కుటుంబం బాధ తలచుకొని ఆమె కూడా కన్నీరు కార్చింది.

రమ్య తల్లి ఇంకా సన్నగా రోదిస్తూనే ఉన్నది.

రమ్య కనిపిస్తే చెడా మడానాలుగు వాయించి, బడి మానేశావెందుకని నిలదీయాలని వచ్చాను. కాని, పరిస్థితి చూస్తుంటే బాధతో గుండె విలవిల్లాడింది. తండ్రి పోయాడని, కుటుంబ భారాన్ని ఆ పసివాడి లేతరెక్కలు మోస్తున్నాయనీ తెలిసి అంతరంగమంతా అతలా కుతలమయ్యింది.

ఇప్పుడు రమ్యను కలిసీ చేయగలిగింది లేదు. కాని ఈ సమస్యకేదో పరిష్కారం చూపాలి. మట్టిలో మాణిక్యం లాంటి వాని బతుకిలా అర్థరహితం కాకూడదు. ముఖ్యంగా వాని బాల్యం కాపాడబడాలి ... గమ్యం లేని ఆలోచనల మధ్య సతమతమవుతూ అక్కడి నుండి కదిలాను.

❖ ❖ ❖

నా ప్రయత్నం కొంతవరకు ఫలించింది. నాకున్న మీడియా మిత్రులతో పాత్రికేయుల్తో ఈ విషయం చర్చించి, మూడు ప్రముఖ పత్రికలలో ఈ వార్తాకథనాలు ప్రచురింపబడేలా చేశాను. టీ.వి.లోనూ కవరేజ్ వచ్చింది.

మేమూహించినట్లే ప్రజాస్పందన లభించింది. పత్రికల ద్వారా ఇచ్చిన ఎడ్రసు వెతుక్కుంటూ కొందరు దాతలు,స్వచ్ఛంద సంస్థలు ఒకరిద్దరు అధికారులు కూడా రమ్యవాళ్ళ కుటుంబాన్ని కలిశారు.

చాలామంది రమ్య పరిస్థితికి జాలిపడ్డారు. అతని ఉన్నత విద్య దాకా అయ్యే పూర్తి

ఖర్చు తాము భరిస్తామని ముందుకొచ్చారు. స్వచ్ఛంద సంస్థల వాళ్ళు బాలకార్మిక వ్యవస్థ చట్టవిరుద్ధమని, వెంటనే పిల్లాడిని పని మాన్పించాలని, ఈ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ సహకారం అందేలా చూస్తామని ఉచితంగా విద్య నేర్పించే ఏర్పాటు చేస్తామనీ అన్నారు. అధికారులు రమ్య తల్లికి విడో పెన్షన్ ఇప్పిస్తామని, తక్షణ సహాయంగా అయిదువేలు అందజేస్తామని హామీ యిచ్చారు. ఈ అలజడి ఓ వారం దాకా సాగింది.

'ఏదో ఒక రకంగా వాళ్ళ జీవితాలు బాగుపడ్తున్నాయి. అంతేచాలు !' అనుకున్నాను. అందులో నా ప్రమేయం అల్పమే అయినా, 'నేను సైతం...' ఏదో చేశానన్న తృప్తి నాకు హాయినిచ్చింది.

పదిరోజుల తర్వాత బైక్‌మీద వెళ్తుంటే యూసుఫ్‌గుడా టర్నింగ్‌లో ఎదురయ్యాడు రమ్య, రిక్షామీద.

"ఏరా ? పని మానెయ్యలేదా ?"ఆశ్చర్యం, అనుమానం నా గొంతులో.

రిక్షా దిగి చేతులు కట్టుకున్నాడు వాడు.

మొదటిసారి తరగతి గదికి ఆలస్యంగావచ్చి, నా అనుమతి కోసం గుమ్మంలో నిలబడ్డ రమ్యకు, ఈ రమ్యకు తేడాలేదు. అదే నిశ్చలత, అదే వినయం.

"కుదరదు సార్ !" అన్నాడు, జీవిత సత్యం బోధిస్తున్నట్లు.

తర్వాత వాడు చెప్పిన విషయాలు వింటే నన్నుజడత్వం ఆవరించసాగింది.

పేపరులో వార్త చూసి ఎంతో ఉత్సాహంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చిన వాళ్ళు ఏ సహాయం చేయకుండానే - సిటీలో నడిరోడ్డుమీద పట్టపగలు యాక్సిడెంట్ చూసి మరచిపోయినంత ఈజీగా వెనకడుగేశారు. అందుకు వాళ్ళనూ పూర్తిగా తప్పుపట్టలేం.

రమ్య తండ్రి పనిమానేశాడు గాని, తాగుడు మానలేకపోయాడు. పసివాడైనా 'పనివాడు'గా మారిన రమ్య ఇల్లు గడవటం లేదన్న బెంగ లేకుండా చేశాడు. ఊళ్ళో ఉన్న కొద్దిపాటి భూమిని ఎరగా చూపి భార్యాపిల్లలకు రోగాలనే సాకు చెప్పి అయిన చోట, కానిచోట వేలకు వేలు అప్పు చేశాడు. చచ్చేవాడు ప్రమాదంకు లోనయ్యో అనారోగ్యంతోనో చనిపోతే

సానుభూతి గాకున్నా సమస్యలేకుండా నయినా ఉండేది. కాని మద్యం దుకాణం దగ్గర గొడవ పెట్టుకొని, ఒకరిద్దర్ని తీవ్రంగా గాయపరచి, హత్యకు గురి అయ్యాడు. వాళ్ళలో ఇంకా ఒకడు మృత్యువుతో పోరాడుతూనే ఉన్నాడు.

"సుమారు ఎనభైవేల అప్పునీ, ముగ్గురు పసివాళ్ళనీ నా కొదిలేసి, సంపాదించే ఒకే ఒక్క ఆధారం నా రమ్యనీ చదువు పేరుతో నానుండి దూరం చేస్తే నా గతేం కావాలి ?" అనే ఆ అమాయకపు తల్లి వేసే బిలియన్ డాలర్ల ప్రశ్న.

సానుభూతి చూపేవాడైనా పిల్లవాడి చదువుకు సహకరించగలరే తప్ప ఒక కుటుంబ భారాన్నిఅప్పుల్తో సహా నెత్తికెత్తుకో గల పుణ్యాత్ములెవరుంటారు ?

చట్టానికీ పరిధులున్నాయి. ప్రతివారికీ పరిమితులున్నాయి. వీటన్నిటినీ అధిగమించి వాళ్ళకు న్యాయం జరిగే రోజు వస్తుందా ? బిగుసుకు పోయిన ఈ పీటముడి తప్పక విప్పదీసుకుంటుందనే ఆశ ఇప్పటికీ నాలో రెపరెపలాడుతూనే వుంది.

"సార్ ! నాకు చదువుకోవాలనుంది సార్ ! ఏదో ఒక విధంగా నాచదువు పూర్తి చేసుకుంటా" నవే రమ్య ఆత్మవిశ్వాసమే అందుక్కారణం.

❀❀❀

(ప్రజా తంత్ర, సెప్టెంబర్ 17-23, 2006)